ప్రేమస్వరూపులారా! కనులకగుపడు దృశ్యంబు గాంచి మీరు సత్యమిదియని అందురు. కాని, సత్యమిది కాదు. ఉన్నదొక్కటే దైవంబు ఎన్నటికిని. కంటికి కనిపించే దృశ్యములన్నీ సత్యమని భావించి మీరు కాలమును వ్యర్థము చేస్తున్నారు. ఇవి యేవీ సత్యము కాదు. సత్యమనగా త్రికాలములయందు మార్పు చెందకుండా నిలిచియుండేది. అదియే దైవము. క్షణక్షణమునకు మార్పుచెందే దృశ్యమును సత్యమని భావించుకోటం ఎంత వెఱ్ఱితనం! ఈనాడు స్టూడెంటు, రేపు ఆఫీసరు, ఎల్లుండి రిటైర్డు ఆఫీసర్. ఇందులో ఏది సత్యము? స్టూడెంటు సత్యమా? ఆఫీసరు సత్యమా? రిటైర్డు ఆఫీసరు సత్యమా? పెండ్లికాక మునుపు భర్త ఎవరు? భార్య ఎవరు? పెండ్లి అయిన తరువాత 'భార్యాభర్తలు' అంటారు. ఈ సంబంధము ఎంత కాలము? అదీ తాత్కాలికమే. ఈవిధంగా జగత్తులో కనిపించే ప్రతి విషయము, ప్రతి కార్యము అనిత్యమైనవే! దైవము అట్టిది కాదు. నిన్న దైవమే, రేపు దైవమే, ఎల్లుండి దైవమే. దైవము ఎప్పటికీ దైవమే! అట్టి సత్యనిత్యమైన దైవత్వాన్ని విశ్వసించక, అనిత్యము, అశాశ్వతము అయిన దృశ్యాల్ని చూసి అవే సత్యమని మీరు భ్రమిస్తున్నారు. కనుక, మొట్టమొదట ఏది సత్యమో గుర్తించటానికి ప్రయత్నించండి. సత్యాన్ని గుర్తించినప్పుడే సర్వమును గుర్తించినవారౌతారు. సత్యాన్ని గుర్తించక ఎన్ని గుర్తించినప్పటికినీ ప్రయోజనం లేదు. అవన్నీ అనిత్యములే! జగత్తంతయూ మార్పు చెందునదే! Lofty mountains, large rivers, huge trees with many branches, which make it a beautiful country. (మహోన్నతమైన పర్వతాలు, పెద్ద నదులు, శాఖోపశాఖలుగా విస్తరించిన మహావృక్షాలు ఇవన్నీ ఈ దేశ సౌందర్యాన్ని ద్విగుణీకృతం గావిస్తున్నాయి) అని భారతదేశాన్ని మనము వర్ణిస్తున్నాము. ఈనాటి పర్వతము రేపు గుట్టగా మారవచ్చును. ఈనాడు చిన్న ప్రవాహముగా ఉన్నది రేపు పెద్ద నదిగా మారవచ్చు. ఈ అనిత్యమైన, అసత్యమైన జగత్తును దృష్టిలో ఉంచుకొని, దీనిని విశ్వసించి, సత్యమైన దైవాన్ని విస్మరిస్తున్నారు. ఇదే మీ కష్టములకు, నష్టములకు, దుఃఖములకు మూలకారణము. కష్టములు వస్తున్నాయంటారు. ఎక్కడనుంచి వస్తున్నాయి? నీ సంకల్పములు, కర్మలయొక్క ఫలితములే నీవనుభవించే కష్టములు. ప్రపంచములో ప్రతి ఒక్కటీ మారేటువంటిదే! మారనటువంటిది ఒక్క దైవమే. అట్టి దైవాన్ని మనము హృదయమునందుంచుకొని మన ప్రేమను ఆ దైవానికే అర్పితము గావించి ఆనందాన్ని అనుభవించాలి. అదే మానవునియొక్క ప్రధాన కర్తవ్యము.

ఏమిటీ జీవితము? తినటము, త్రాగటము, నిద్రించటము, మరణించటం... ఇదేనా? ఇంతమాత్రముచేత మానవత్వము పవిత్రమైనదని ఏరీతిగా చెప్పడానికి వీలవుతుంది? మానవుడు పుట్టినప్పుడు చాలా పవిత్రునిగా ఉన్నాడు. క్రమంగా పెరుగుతున్నకొద్దీ ఆ పవిత్రతను కోల్పోతున్నాడు. అది సరికాదు. ఎప్పటికీ పవిత్రంగానే ఉండాలి. నన్ను చూడండి – నేను పుట్టినప్పుడు బాలుడను. నేను ఎప్పటికీ బాలుడనే! అయితే, శారీరకంగా ఎన్నో మార్పులు కలుగుతుంటాయి. ఈ మార్పులు కేవలము భౌతికమైనవి. దేహము, మనస్సు, ప్రాణము, బుద్ధి ఇవన్నీ భౌతికమైనవి. ఇంక కామ, క్రోధాది అరిషడ్వర్గములు మన భ్రమలే! వీటివల్లనే మనము ఆత్మను గమనించలేకపోతున్నాము. 'జంతూనాం నరజన్మ దుర్లభం' అన్నారు. దుర్లభమైన మానవ జన్మ ఎత్తినందుకు మనలోని ఆత్మను గమనించాలిగాని, ఈ లౌకికమైన, భౌతికమైనటువంటి విషయాలను గుర్తించటానికి ప్రయత్నించరాదు. ఆత్మను గమనించినవాడే ముక్తుడు. ఆత్మదృష్టిని నిరంతరము

హృదయమునందుంచుకున్నవాడే ముక్తుడు. భుక్తి కోసము తాపత్రయపడేవానికి కేవలం పంచభూతములు, పంచకోశములు, పంచేంద్రియములపైనే ధ్యాస ఉంటుంది. అట్లుకాకుండా, 'దేహమనిత్యము, మనస్సు చంచలమైన కోతివంటిది', అని తెలుసుకున్నవానికి మాత్రమే ఆత్మదృష్టి ఉంటుంది. దేహము చూస్తామా అంటే నీటిబుడగ. ఇది అనిత్యమైనదని తెలిసికూడను దీనినే నమ్ముకొని జీవిస్తున్నారు. దేహాభిమానము ఉండినంతవరకు జీవితమంతయు కేవలము కష్టనష్టములతో, సుఖదుఃఖములతో, పాపపుణ్యములతో బాధపడవలసినదే.

దేహము పాంచభౌతికము దేహము కూలక తప్పదెప్పుడున్
దేహి నిరామయుండు గణుతింపగ దేహికి చావుపుట్టుకల్
మోహనిబంధ బంధనల ముద్రలు లేవు నిజంబుజూడ యా
దేహియె దేవదేవుడు మదిన్ గణుతింపగ ఆత్మరూపుడౌ!

'దేహి' అనేదే స్థిరమైనది. దానినే 'ఆత్మ' అని పిలిచారు. దేహముయొక్క పేరు నీ తల్లిదండ్రులు పెట్టినది. ప్రజలంతా ఈ పేరుతో నిన్ను పిలుస్తున్నారు. దేహమును గుర్తించుకునే నిమిత్తమై కొన్ని పేర్లు అవసరము. 'అనిల్ కుమార్' అంటే అతని రూపమునకు గుర్తు. 'సత్యసాయిబాబా' అనే పేరు ఈ దేహాన్ని నిరూపిస్తుంది. పేర్లు లేకపోతే రూపమును గుర్తించుటకు వీలుకాదు. మానవుడు బాహ్య ప్రపంచములో జీవిస్తున్నాడు కనుకనే ఈవిధమైన భౌతికమైన లక్షణాలు నిరూపిస్తూ వచ్చారు. కాని, ఇవన్నీ కేవలము దృశ్యకల్పితములే. ఏది మనము చూడలేమో అదియే సత్యము. అదియే ఆత్మ. కాబట్టి, 'నీవెవరు?' అని అడిగినప్పుడు, 'నేను ఆత్మను' అని చెప్పాలి. దేహము యొక్క పేరు మనకు ప్రధానము కాదు. ఈ రూపనామములు అనిత్యమైనది. ఈ ప్రపంచములో ఉండినంతవరకు మాత్రమే వీటికి ఉపయోగమున్నది. ప్రపంచమును వదలిపెడితే ఎవ్వరూ వీటిని గుర్తించరు. ఒక కోటీశ్వరుడున్నాడు. కుప్పలుతిప్పలుగా, దండిగా డబ్బులున్నాయి. అతనికి మరణ కాలము ఆసన్నమైనది. చాలా బాధపడుతున్నాడు. చుట్టూ ఉన్న బంధువులందరూ ఏడుస్తున్నారు. ఆ సమయంలో అతనికి జ్ఞానోదయమైంది. ఆది శంకరులు చెప్పారు, 'పునరపి జననం పునరపి మరణం, పునరపి జననీ జఠరే శయనం'. దేహము ఉన్నంత వరకే ఇది. తరువాత దీనిని ఎవ్వరూ చూడరు కదా, అని తెలివి తెచ్చుకున్నాడు. 'అయ్యా! నేను సంపాదించిన ధనమంతా మీకే అప్పచెప్పాను. నేను కట్టిన మేడలు, మిద్దెలు మీకే అప్పచెప్పాను. నా బ్యాంక్ డిపోజిట్టంతా మీకే అప్పచెప్పాను. అయినప్పటికీ ప్రస్తుతం నా గతి ఏమిటో మీరు యోచించకుండా మీ భవిష్యత్తును మాత్రమే మీరు చూసుకుంటున్నారు', అని వాపోయాడు. ఎవ్వరైనా లోకములో ఉండినంతవరకు లోకసంబంధమైన ఆస్తిపాస్తులను మాత్రమే చూసుకుంటారు. కాని, ప్రాణము ఎక్కడకు వెడుతుందో అనేది యేమాత్రమూ యోచించటంలేదు. దేహం ఉన్నంత వరకు ఇది మన దేహమునకు సంబంధించినది, మనస్సుకు సంబంధించినది మాత్రం మనం భ్రమిస్తున్నాము. ఇప్పుడిక్కడ కూర్చున్నావు. లేచి రెండడుగులు వేసేటప్పటికి నీ పరిస్థితి ఏమిటో తెలియదు. దేహము మరణించిన తరువాత ఎవరికి ఎవరు సంబంధము? ఏ ఫ్రెండ్సుకి సంబంధము? ఏ బంధువులకు సంబంధము? ఎవ్వరికీ సంబంధము లేదు. కనుక, దేహమునే మనము ప్రధానంగా లక్ష్యమునందుంచుకో కూడదు. సత్కర్మలద్వారా దేహాన్ని పరిశుద్ధము చేయాలి. ఈ ప్రపంచముతో అనేక రకములైన సంబంధాలు పెట్టుకోటం చేత అనేక మాలిన్యములు చేరిపోతున్నాయి. ఆ మాలిన్యాన్ని కొంత వరకు శుభ్రం చేసుకున్నప్పుడే ఆరోగ్యము కుదురుతుంది. మొన్న వర్షాలు వచ్చినాయి. వర్షాలవల్ల నీరంతా పొల్యూషన్ అయిపోయింది. ఆ పొల్యూషన్ నీరు త్రాగి చాలమందికి జ్వరాలు వచ్చాయి. ఎక్కడ చూచినా కష్టములు, నష్టములు, దుఃఖములు, విచారములు. దీనికి కారణం తినే తిండిలోనో, త్రాగే నీటిలోనో, పీల్చే

గాలిలోనో పొల్యూషన్ చేరింది. కనుక, ఈ పొల్యూట్ అయిన దానిని కొంతవరకు పవిత్రము చేసుకోవాలి. అందుకే నవవిధములైన సాధనలు బోధించారు.

శ్రవణం కీర్తనం విష్ణోఃస్మరణం పాదసేవనమ్
అర్చనం వందనం దాస్యం సఖ్యమాత్మనివేదనమ్.

ఈ తొమ్మిది విధములైన తత్త్వములలో దేనినో ఒకదానిని అనుసరించి ఈ పొల్యూషన్‌ను పరిశుద్ధము చేసుకోవాలి. మానవత్వము దైవత్వముతో కూడినదేగాని కేవలం జీవత్వము కాదు. ప్రతి మానవుడు, ప్రతి ప్రాణి దైవస్వరూపమే. చివరకు, క్రిమికీటకాదులు కూడ దైవత్వమే. మానవుడు చేయవలసిన సాధన ఏమిటి? 'సాధన' అనగా కేవలం ఫిజికల్ ఎక్సర్‌సైజే కాదు. (శారీరక వ్యాయామమే కాదు) మానసిక సంబంధమైన విచారణ. ఏది ట్రూత్? దేహము నిజమా? మనస్సు నిజమా? బుద్ధి నిజమా? కాదు, కాదు. ఏదీ కాదు. మైండ్ ఒక mad monkey. మనస్సు చంచలమైనది. ఇలాంటి చంచలమైన మనస్సును మనం ఫాలో చేస్తూ పోతుంటే గమ్యం చేరలేము. ఏనాటికైనా మనం దీనిని వదలక తప్పదు. కనక, దీనిని మరచిపోటానికి తగిన ప్రయత్నము చేయాలి. ఐతే ఈ దేహాన్ని కాపాడుకొనే నిమిత్తము ఆహారవిహారములు అత్యవసరము. ఆవికూడను సాత్వికమైన, పవిత్రమైన, పరిశుద్ధమైన ఆహారముగా తీసుకోవాలి. ఈవిధంగా చేస్తూపోతుంటే యింతకంటె సాధన యేమికావాలి? ఏమి తీసుకుంటున్నా 'సో...హం' 'సో...హం' సో..నీవు, హం..నేను. 'నీవే నేను, నీవేనేను' అని దైవత్వము గురించి మనము చక్కగా విచారణ చేయాలి. అదే 'అహం బ్రహ్మాస్మి' అని చెప్పారు వేదములో. "నేనే బ్రహ్మను. నేను దైవమును. నేను కేవలం పంచభూతములోకూడిన మానవుడను కాదు. నేను దైవత్వాన్ని. నిర్మోహ తత్త్వమును", అని మీరందరూ తెల్లవారి లేచినది మొదలుకొని రాత్రి పరుండునంతవరకు ప్రతి క్షణం మీకు మీరు గుర్తు చేసుకోవాలి. 'నేను దైవాన్నే'. నన్ను కన్నది, పెంచినది దైవమే అని విశ్వసించాలి. తల్లినిచ్చినది ఎవరు? దైవము కాదా! ప్రతి ఒక్కటి దైవముయొక్క కృపయే. దైవచింతన మరచి అన్యచింతలు పెట్టుకుంటే అన్నీ పోతాయి. దైవాన్ని మనసులో ఉంచుకొంటే ప్రాపంచిక చింతలన్నీ దూరమైపోతాయి. కనుక, అటువంటి దైవభావాన్ని మనం ప్రేమతో పెంచుకోవాలి. "ప్రేమ ముదిత మనసె కహో రామ రామ రాం." ఈ ప్రేమయే దైవము. దైవమే ప్రేమ. ఈ ప్రేమయే లేకుండిన no mother, no father, no brother, no wife. అంతా ప్రేమతో కూడినదే. కేవలము మన అనుకూల నిమిత్తమై, మన ఆనంద నిమిత్తమై, మన స్వార్థ నిమిత్తమై ప్రాపంచికమైన సంబంధ బాంధవ్యములను కల్పించుకుంటున్నాము. స్వార్థమును త్యజించి మొట్టమొదట self relaisation అనగా, ఆత్మసాక్షాత్కారముకోసం ప్రయత్నించు. నే నెవరు? దేహమా? మనసా? బుద్ధా? చిత్తమా? అహంకారమా? ఇవేవీ కాదు. నేను నేనే. ఈరకమైన నిశ్చయమైన సత్యాన్ని మనం గుర్తించాలి. మీరందరూ చదువుకుంటున్నారు. బి.ఏ, బి.కాం, ఎం.బి.ఎ, డాక్టరేటు డిగ్రీలు తీసుకుంటున్నారు. ఇటువంటి డిగ్రీలు తీసుకున్నవారు లోకములో ఎంతమంది లేరు? వారి వలన లోకమునకు యేమి ఉపకారము? వారంతా వారి పోషణే చూసుకుంటున్నారు గానీ ఇతరులకు సహాయము చేయటం లేదు. కనుక, ఈ చదువులన్నీ పొట్టకూటి నిమిత్తమే. అది కాదు ముఖ్యము. మనము స్వార్థరహితముగా త్యాగము చేయాలి. డిజైరుయొక్క ఫలితమును త్యాగము చేయాలి. ఆ విధముగా త్యాగము చేసినప్పుడే వాడు నిజమైన యోగి. యోగి అంటే కేవలము చెట్టు క్రింద కూర్చొని, కన్నులు మూసుకొని జపం చేయటం కాదు. నీ డిజైర్సును త్యాగం చేయటమే నిజమైన త్యాగము. ఇలాంటి చిన్నచిన్న పదాలలోనే మానవత్వాన్ని తెలుసుకోవాలి. మన హృదయాన్ని విశాలం గావించుకోవాలి. కేవలం నేరో మైండ్‌గా ఉండకూడదు. ఈ నేరోమైండ్ వల్ల మరింత నేరోగా తయారౌతాం. బ్రాడ్ మైండ్. బ్రాడ్ హార్ట్. ఇక్కడ 'హార్ట్' అంటే ఫిజికల్ హార్ట్ కాదు. ఫిజికల్ హార్ట్ అయితే హార్ట్ ఆపరేషన్ చెయ్యాల్సి వస్తుంది. ప్రేమను అభివృద్ధి పరచుకోవాలి.

అప్పుడే నిజమైన మానవుడవౌతావు.

విద్యార్థులారా! స్వామి చెప్పే మాటలు చాలా తేలికగా ఉంటాయని మీరనుకుంటారు. అయితే, సర్వ వేదముల సారముల అందులోనే ఉంటున్నాది. సర్వ శాస్త్రముల సారము నా మాటలోనే ఉంటున్నాది. శాస్త్రములు చదివితినంచు గర్వమెందుకు? ప్రపంచములో మానవుడు చదువులెంత చదివినప్పటికినీ వినయవిధేయతలతో ఉండాలి. జ్ఞానము కలిగినటువంటి వాడు వినయుడై ఉండాలి. మానసిక తత్త్వములో డిజైర్ లెస్ గా ఉండాలి. అప్పుడే నీవు సరైన మానవుడిగా ఉంటావు. ఎక్కువ డిజైర్సు చాలా ప్రమాదము. అనవసరమైన వాంఛలను మీరు పెంచుకోకూడదు. దీనివల్ల కాలముకూడా వ్యర్థము. కాలము వ్యర్థము చేసుకున్నవాడు జీవితాన్నే వ్యర్థం చేసుకున్న వాడవుతాడు. time is God, don't waste time. time waste is life waste. కనుక, మీరు టైమును వేస్టు చేయకూడదు. ఏ కాస్త సమయం చిక్కినా ఆ సమయంలో 'సోహం' తత్త్వమును స్మరించు. అప్పుడే నీకు సరైన మానవత్వము కుదురుతుంది. ఊరికే న్యూస్ పేపర్సంతా చదువుతూ కూర్చుంటే తలలో అంతా న్యూసెన్సే చేరిపోతుంది. ఇప్పుడు ఎక్కడ చూచినా న్యూస్‌పేపర్సంతా 'న్యూసెన్సు'గా ఉంటున్నాయి. మనకు అవసరములేని వన్నింటినీ వేస్తున్నారు. ఆ బొమ్మలు మీరు చూశారా? ఆ విషయాలంతా మీరు చూసారా? ఛీ, ఛీ... ఆ పేపరే చూడబుద్ధి కాదు. అది కాదు మనకు కావలసినది. రూపనామములకు అతీతమైన భగవంతుని దర్శించాలి. కదళికర్జూరాది ఫలములకన్న భగవన్నామమే అత్యంత మధురమైనది. ఈ పండుగలన్నీ దేనికోసం వస్తున్నాయి? ప్రతి పండుగ దైవాన్ని జ్ఞాపకము చేసే నిమిత్తమై వస్తున్నది. అన్ని మతముల వారికి పండుగలున్నవి. "మతములన్ని చేరి మంచినే బోధించె. తెలిసి మెలగవలయు తెలివితోడ" అన్నీ మంచినే బోధిస్తున్నాయి. మతము చెడ్డది కాదు. అందువలన ప్రతి మతము వారిని గౌరవించాలి. మతి చెడ్డదైనప్పుడే మతము చెడ్డదౌతుంది. మతి మంచిదిగా పెట్టుకున్నప్పుడు మతములన్నీ ఏకమైపోతాయి.

విద్యార్థులారా! కాలము వ్యర్థము చేయకండి. కాలమును పవిత్రము గావించుకొని తద్వారా ఆనందమును అనుభవించండి. మానవుడు ఆనందమయుడు. నిరంతరము నీవు ఆనందముగా ఉండాలి. నీవు డిజైర్సు పెట్టుకొని కృంగిపోయి ఉండకూడదు. happiness is union with God. కనుక, మీరు నిరంతరమూ నవ్వుతూ ఆనందంగా ఉంటుండాలి. ఏ పరీక్షలు రానీ, ఏమి కష్టములు వచ్చినా కేస్టరాయిల్ ఫేస్ వేయకూడదు. ఎప్పుడూ నవ్వుతూ ఉండాలి. మీరు ఎంత ఉత్సాహంగా ఉంటారో మీలోనున్న ఆనందము అంతగా అభివృద్ధి అవుతుంది. మీరు వర్రీ చేయాల్సిన అవసరమేమున్నది? ఏమీ లేదు. పరీక్షలు వచ్చాయంటే చదవని వారికే వర్రీ. చదివితే పరీక్షల భయమెందుకు? మీరు చదువుతే తప్పక మంచి మార్కులు వస్తాయి. తప్పక మీరు బాగా చదివి, ఉత్తీర్ణులై దేశాన్ని ఉద్ధరించండి.

ఈనాటి పండుగ మిమ్మల్ని ఉత్సాహపరచటానికి వచ్చినదే. ఈ దసరా ఉత్సవాలు అనగా దశేంద్రియములను అరికట్టడానికై ఉద్దేశించినవి. దసరాల్లో చాముండి అసురుని వధించింది. దీని ఆంతర్యమేమిటి? మనము అసురులను యేమాత్రమూ దగ్గరకు చేర్చుకోకూడదు. నీవు నరుడవు. వాడు అసురుడు. నరునికి అసురునితో సంబంధమెందుకు? నరుడు నరునితోనే సంబంధము పెట్టుకోవాలి. సత్సంగత్వే నిస్సంగత్వం, నిస్సంగత్వే నిర్మోహత్వం, నిర్మోహత్వే నిశ్చల తత్త్వం, నిశ్చలతత్త్వే జీవన్ముక్తిః. be in good company. bad companyతో చేరితే నీవూ చెడ్డవాడౌతావు. కనుక, మనం చెడ్డవారితో స్నేహము చేయకూడదు. వారు కనిపిస్తేనే గుడ్‌బై చెప్పి వెళ్లిపొండి. ద్వేషముకూడా వద్దు. ఎవరిని చూసినా దైవస్వరూపులుగా భావించి నమస్కరించండి. ద్వేషులు వచ్చినా వారికి కూడా నమస్కారము చేయండి. how are you brother? అని ప్రశ్నించు. వారుకూడ, how are you brother? అని వారుకూడా ప్రశ్నిస్తారు. ద్వేషిని చూసి తల తిప్పుకోవద్దు.

మానవుడనగా మానవతా విలువలు కలిగినవాడు. human qualities ఏమేటి? సత్య, ధర్మ, శాంతి, ప్రేమ, అహింస. ప్రేమ ఉంటే శాంతి వస్తుంది. శాంతి వస్తే ధర్మము వస్తుంది. ధర్మము ఉన్నప్పుడు సత్యము వస్తుంది. ఎప్పుడూ సత్యము పలుకు. ధర్మమును పెంచుకో. శాంతిగా ఉండు. ఆనందంగా మెలగు. సమాజములో ప్రేమతత్త్వముతో పెరగాలి. ప్రేమే దైవము, దైవమే ప్రేమ. live in love. అప్పుడే సరైన జ్ఞానము వస్తుంది.

ప్రేమస్వరూపులారా! నేనెప్పుడూ ప్రేమస్వరూపులారా అంటాను. ఎందుచేతనంటే నాలో ఉన్నది ప్రేమయే. ఆ ప్రేమయే నా ప్రోపర్టీ. ఆ ప్రోపర్టీకి మీరందరూ వారసులుకండి. మీ అందరికీ ఆ ప్రేమను పంచుతాను. నేనెవ్వరినీ ద్వేషించను. నాకు ఎట్టి స్వార్థమూ లేదు. నాది స్వార్థరహిత ప్రేమ.

(ప్రేమ ముదిత మనసె.....)

2006 దసరా సందర్భముగా 27వ తేదీ సాయికుల్వంత్‌లో భగవాన్ బాబావారి దివ్యోపన్యాసం